# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

**మున్నేరు ముంపు బాధితులందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుంది**

**వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనలో మాజీ మంత్రి అజయ్**

**ముంపు ప్రాంతాల్లో బాధితులకు ధైర్యం చెప్పిన ఎంపీ వద్దిరాజు**



కాలనీల్లో పర్యటించి బాధితులను ఓదార్చుతున్న మాజీ మంత్రి పువ్వాడ



ముంపు ప్రాంతాల్లో పేరుకుపోయిన బురదను పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

ఖమ్మం, సెప్టెంబర్ 2: నగర ప్రజలెవరూ అధైర్య పడొద్దని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. సర్వం కోల్పోయి నిరాశ్రయులైన వారికి పార్టీ వెన్నుదన్నుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా ఖమ్మంలోనే మున్నేరు పరీవాహకంలో ఇళ్లు నీటమునిగి సర్వం కోల్పోయిన బాధితులను అజయ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. నగరంలోని ఆయా ప్రాంతాల్లో నీటమునిగి తేరుకున్న ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన పర్యటించారు. వెంకటేశ్వరగనర్, బొక్కలగడ్డ, మంచికంటినగర్, మోతీనగర్, ప్రకాశ్‌నగర్‌లలో బాధితులను ఓదార్చారు. ఇళ్లలోకి వెళ్లి నష్ట తీవ్రతను పరిశీలించారు. అయితే, మాజీ మంత్రి తమ ఇళ్లలోకి రాగానే.. తడిసిన వస్తువులు, సామాన్లు, టీవీలను, ఫ్రిడ్జ్‌లు, ఇతర వస్తువులను బాధితులను ఆయనకు చూపించి కన్నీటిపర్యంతమయ్యారు. తాము సర్వం కోల్పోయామంటూ కంటతడి పెట్టుకున్నారు. 'మీరు మంత్రిగా ఉన్నప్పుడు మా వస్తువులు భద్రంగా ఉంచుకోగలిగాం. ముందస్తు సమాచారంతో విలువైన ఆస్తులను, వస్తువులను కాపాడుకోగలిగాం. పునరావాస కేంద్రాల్లో వసతి పొందాం. ఇళ్లకు చేరుకున్నాక ట్యాంకర్లతో మీరు నీళ్లు పంపిస్తే వాటితో ఇళ్లను శుభ్రం చేసుకున్నాం.' అంటూ గత విషయాలను గుర్తుచేశారు. 'కానీ ప్రభుత్వం మమ్ములను అప్రమత్తం చేయలేదు. దీంతో వరద వచ్చి మేం సర్వం కోల్పోయాం. రెండు రోజులు అల్లాడినా ఈ ప్రభుత్వం మాకు కనీసం అన్నపానీయాలూ అందించలేదు' అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇలాంటి విపత్తుల సమయంలో గతంలో తమ ప్రభుత్వం ఎంతో ముందుచూపుతే వ్యవహరించేందని గుర్తుచేశారు. తాజా వరదల నేపథ్యంలో మున్నేరు బాధితులను ఈ ప్రభుత్వం ఆదుకోవాలని, ఇంటికి రూ.2 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, భీబీరెడ్డి నాగచంద్రారెడ్డి, తోట వీరభద్రం, తోట రామారావు, తోట గోవిందమ్మ, తోట ఉమారాణి, పల్లా రోజ్‌లీనా, కూరాకుల వలరాజు, కన్నం వైష్ణవి, నాగండ్ల కొటి, జ్యోతిరెడ్డి, బచ్చు విజయ్‌కుమార్, కన్నం ప్రసన్నకృష్ణ, దేవభక్తిని కిశోర్‌బాబు, మాటేటి కిరణ్‌కుమార్, గొల్లపూడి హరికృష్ణ, మాటేటి నాగేశ్వరరావు, మిట్టపల్లి శ్రీను, పత్తిపాక రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**వరద బాధితులకు వద్దిరాజు ఓదార్పు..**

ఖమ్మంలోని మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కూడా పర్యటించారు. వరదలతో సర్వం కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధితులను ఓదార్చారు. అనంతరం ముంపు ప్రాంతాలను కూడా పరిశీలించారు. వరదలో చిక్కుకున్న పలువురిని కాపాడి పునరావాస కేంద్రానికి చేర్చిన స్థానికుడు ఎరబడి నర్సింహారావును ఎంపీ రవిచంద్ర అభినందించారు. అనంతరం ఆయన వరద బాధితులకు చేయూతనందించారు. వెంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ, జూబ్లీపుర ప్రాంతాల్లోని ముంపు ప్రాంత వాసులకు ఎంపీ రవిచంద్ర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, ఆలుగడ్డలు, మంచినూనె, ఉప్పు, కూరగాయల వంటి సరుకులను పెద్ద సంచుల్లో వేసి ప్యాకింగ్ చేసి బాధితులకు పంపిణీ చేశారు.

















